RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం AKSHARA VEDAM TELUGU DAILY

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్ 9666992524

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక : 40 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | శనివారం 10-01-2026 | పేజీలు -8 | వెల: రూ. 05.00

## మెక్సికోపై సైనికచర్య చేపడుతాం:

### డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

- అక్కడ్నుంచే డ్రగ్ కార్టెల్స్ ఏరివేత
- మా దేశం అమెరికా జాగీరు కాదు: మెక్సికో అధ్యక్షురాలు





**న్యూఢిల్లీ:--జనవరి09 అక్షర వేదం**

వెనెజువెలాపై చర్యలు తీసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్ను ఇప్పుడు మెక్సికోపై పడింది. మెక్సికోలోని డ్రగ్ కార్టెల్స్(సిండికేట్లు)కు వ్యతిరేకంగా తన ప్రభుత్వం క్షేత్రస్థాయి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ట్రంప్ గురువారం ప్రకటించారు. మెక్సికోను డ్రగ్ కార్టెల్స్ నియంత్రిస్తున్నాయని, ఆ దేశ పరిస్థితి చూస్తే విచారంగా ఉందని ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో -మిగతా 2 లో


## బొగ్గు స్కామ్‌లో అమిత్ షా!

- ఈడీ దాడులపై భారీ నిరసన
- నన్ను బెదిరించొద్దు.. మీ గుట్టు మొత్తం విప్పుతా
- ఆ స్కామ్ సొమ్ము మీకే చేరింది
- నా వద్ద పెన్‌డ్రైవ్ సాక్ష్యలున్నాయి
- అమిత్ షాకు మమత హెచ్చరిక



**న్యూఢిల్లీ, -జనవరి09 అక్షర వేదం**

తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ వ్యూహకర్త ఐ-ప్యాక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు జరపడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై శుక్రవారం విరుచుకుపడ్డారు. తనపైన, తన ప్రభుత్వంపైన ఓ స్థాయికి మించి ఒత్తిడి పెంచితే బొగ్గు కుంభకోణంలో అమిత్ షా పాత్రకు -మిగతా 2 లో



## 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్
- తిరిగి మార్చి 9వ తేదీన పార్లమెంట్ సమావేశతిరిగి మార్చి 9వ తేదీన పార్లమెంట్ సమావేశం

**న్యూఢిల్లీ**

ఈ నెల 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర బడ్జెట్‌ను పార్ల మెంట్‌కు సమర్పించనున్నారు. జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారని అధికారులు శుక్రవారం తెలిపారు. పార్లమెంటరీ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ తాత్కాలికంగా ఈ షెడ్యూల్‌ను ఖరారు చేసిందని చెప్పారు. ప్రతి ఏటా పార్లమెంట్ మొదటి సమావేశం మొదటి రోజున రాష్ట్రపతి ప్రసంగించడం ఆనవాయితీగా వస్తోంది. బీటింగ్ రిట్రీట్ ఉత్సవం కారణంగా 29వ తేదీన ఉభయ సభలు సమావేశం కావు. తిరిగి 30వ తేదీన పార్లమెంట్ -మిగతా 2 లో




# జల వివాదాలకు చెక్ పెడదాం

### ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- ఫార్మా రంగంలో తెలంగాణ నెంబర్ వన్
- బల్క్ డ్రగ్స్ తయారీ 40 శాతం తెలంగాణలోనే
- జర్మన్ టెక్నాలజీతో ఐవీ ఫ్లూయిడ్స్
- రంగారెడ్డి జిల్లా ఈ-సిటీలో సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్ ప్రారంభం



**రంగారెడ్డి -జనవరి09 అక్షర వేదం**

నదీజలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా..! నీళ్లు కావాలా..! అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లు కావాలని కోరుకుంటామని చెప్పారు. కృష్ణా జలాల విషయంపై కూర్చొని మాట్లాడుకుందామని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల్‌లోని ఈ-సిటీలో నెలకొల్పిన సుజెన్ మెడికేర్ -మిగతా 2 లో



## పుర'పోరు'కు గులాబీ సైన్యం రెడీ..

- వరుసగా జిల్లాల సన్నాహక సమావేశాలు పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం
- నేడు ఖమ్మం, నిజామాబాద్ మీటింగ్
- పట్టణాల్లో సర్కార్ రూపాయి ఖర్చు చేయలే
- గ్రామీణ ప్రజలు కాంగ్రెస్‌ను తిరసరించారు
- అదే స్ఫూర్తితో మున్సిపోల్స్‌లో విజయ కేతనం ఎగురవేయాలని పిలుపు

**హైదరాబాద్, -జనవరి09 అక్షర వేదం**

తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు. 'పురపోరు'లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యం గా జిల్లాలవారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేటీఆర్ వరుసగా మున్సిపాలిటీల వారీగా నేతలతో భేటీ అవుతున్నారు. ఇప్పటికే వరంగల్, కరీంనగర్ జిల్లాల నేతలతో సమావేశమైన ఆయన.. శనివారం ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నేతలతో భేటీ కానున్నారు. హైదరాబాద్‌లో -మిగతా 2 లో



## హిమాచల్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

- 500 అడుగుల లోయలో పడిన బస్సు..
- 9 మంది మృతి

**సిర్మౌర్ --జనవరి09 అక్షర వేదం**

హిమాచల్‌ప్రదేశ్ సిర్మౌర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రయివేట్ బస్సు లోయలో పడి 9 మంది చనిపోయారు. 40 మందికిపైగా గాయపడ్డారు. శిమ్లా నుంచి కుప్వికి వెళ్తున్న బస్సు హరిపుర్‌ధర్ దగ్గర అదుపుతప్పి 500 అడుగుల లోయలో పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను బస్సు లోపల నుంచి బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న సహాయక సిబ్బంది గాయపడ్డ వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనపై హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

-మిగతా 2 లో

## ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- ఉక్రెయిన్ జరిపిన దాడికి ప్రతీకారంగానే శుక్రవారం ఈ దాడులు
- ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపైకి వందల సంఖ్యలో డ్రోన్లు దాడి
- ఉక్రెయిన్‌పై రష్యా ఒరెష్నిక్ క్షపణితో ప్రయోగం
- ధ్వని కన్నా 10 రెట్ల వేగం దాని ప్రత్యేకత

2 లో



## రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు?

- జల జగడాలు వద్దు
- తెలుగుజాతి ప్రయోజనాలే ముఖ్యం
- 2027 మార్చిలోగా 'పోలవరం' పూర్తి
- రాయవరం సభలో ఏపీ సీఎం చంద్రబాబు
- దళితులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ




**రాజమహేంద్రవరం -జనవరి09 అక్షర వేదం**

'సముద్రంలో కలిసే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు? నీళ్లు వద్దూ గొడవలే కావాలని కొందరు బయల్దేరారు. కొందరు రాయలసీమ ఎత్తిపోతల అంటూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నాకు గొడవలు కాదూ తెలుగు జాతి ప్రయోజనాలు కావాలి. పోలవరం పూర్తయితే ఆ నీళ్లు తెలంగాణ కూడా వాడుకునే అవకాశం ఉంటుంది. వివాదాల వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. తొలుత రాయవరం గ్రామంలో సర్వే చేసిన పంట భూములను పరిశీలించారు.

-మిగతా 2 లో

## సీతారామ ప్రాజెక్టుతో సస్యశ్యామలం

- దేశానికే ఆదర్శంగా ఆయిల్ పామ్ సాగు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తా.. : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సంక్రాంతి నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు




**అశ్వారావుపేట--జనవరి09 అక్షర వేదం**

గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన చిరకాల కోరిక అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో జరిగిన రైతు మేళా కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రియ వ్యవసాయ పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడం కోసం జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమంలో -మిగతా 2 లో

## డీజీపీకి హైకోర్టులో ఊరట

- నాలుగు వారాల్లో నియామక ప్రక్రియ పూర్తి చేయాలి -ఆదేశించిన కోర్టు
- తదుపరి విచారణ ఫిబ్రవరి 5కు వాయిదా





**హైదరాబాద్ -జనవరి09 అక్షర వేదం**

రాష్ట్ర డీజీపీగా శివధర్ రెడ్డికి శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. డీజీపీ నియామకం చట్ట విరుద్ధమని పేర్కొంటూ దాఖలైన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ పుల్లా కార్తీక్ ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్ డీజీపీ నియామకం కోసం ప్రకాశ్ సింగ్ బాదల్ కేసులో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల అమలు ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. -మిగతా 2 లో

## బొగ్గు స్కామ్‌లో అమిత్ షా!

మొదటి తరువాయి



సంబంధించి తన వద్ద ఉన్న ఆధారాలను బయటపెట్టవలసి వస్తుందని మమత హెచ్చరించారు. ఈడీ దాడులను నిరసిస్తూ కోల్‌కతాలో శుక్రవారం జరిగిన ప్రదర్శననుద్దేశించి మమత ప్రసంగిస్తూ నా దగ్గర పెన్ డ్రైవ్‌లు ఉన్నాయి. నా పదవిపైన ఉన్న గౌరవంతో ఇప్పటివరకూ మౌనంగా ఉన్నాను. నా సహనాన్ని పరీక్షించకండి. మీ గుట్టంతా బయటపెడతా. దాన్ని చూసి యావద్దేశం షాకయిపోతుంది అంటూ అమిత్ షాను ఉద్దేశించి హెచ్చరించారు.పీఎంఎల్‌ఏ కింద దర్యాప్తు చేస్తున్న అక్రమ బొగ్గు గని కేసుకు సంబంధించి ఐ-ప్యాక్ కార్యాలయం, సంస్థ అధిపతి ప్రతీక్ జైన్ కార్యాలయంపైన గురువారం ఈడీ దాడులు నిర్వహించింది. ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో పోలీసులు, ఇతర అధికారులను వెంటపెట్టుకుని ఆ రెండు కార్యాలయాలకు వెళ్లిన మమతా బెనర్జీ కొన్ని ఫైళ్లు, పెన్ డ్రైవ్‌లతో బయటకు రావడం ఉద్రిక్తతకు దారి తీసింది. తన పార్టీకి చెందిన ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన కీలక వివరాలు ఈ ఫైళ్లలో ఉన్నట్లు మమత వెల్లడించారు.

**ఈడీపై రోడ్డెక్కిన మమత**

ఐ-ప్యాక్ కార్యాలయాలపై ఈడీ దాడులను నిరసిస్తూ శుక్రవారం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతా వీధుల్లో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సందర్భంగా ఆమె తన బలనిరూపణకు అవకాశంగా ఈ ర్యాలీని ఉపయోగించుకున్నారు. రాజకీయ కక్షసాధింపు కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నదంటూ నినాదాలు చేస్తూ 8బీ బస్టాండు నుంచి హజ్రా మోర్ వరకు మమతతోపాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారు.

## మెక్సికోపై సైనికచర్య చేపడుతాం:

మొదటి తరువాయి

ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలో ప్రతి ఏటా 2.50 లక్షల నుంచి 3 లక్షల మంది మరణాలకు ఈ కార్టెల్స్ కారణమని ఆయన తెలిపారు. సముద్ర మార్గంలో డ్రగ్స్ అక్రమ రవాణాను 97 శాతం అరికట్టామని ట్రంప్ చెప్పారు. ఇక తదుపరి చర్య మెక్సికో గడ్డపై నుంచే ఉంటుందని ఆయన వెల్లడించారు.

**అమెరికా జాగీరు కాదు**

ట్రంప్ వ్యాఖ్యలపై మెక్సికో ప్రధాని క్లాడియా షీన్‌బామ్ తీవ్రంగా స్పందించారు. మెక్సికో స్వతంత్ర, సార్వభౌమ దేశమని, తమ దేశంలో ఇతరుల జోక్యాన్ని సహించే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. డ్రగ్స్ కార్టెల్స్‌ని అంతం చేసేందుకు మెక్సికోకు అమెరికన్ సైనిక బలగాలను పంపుతానని తాను పదేపదే ప్రతిపాదించినా ప్రధాని షీన్‌బామ్ తోసిపుచ్చారని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ సహకరించడానికి తాము సిద్ధమేనని, అయితే విదేశీ జోక్యాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఉభయ దేశాలు ఇప్పటికే కలసి పనిచేస్తున్నాయని, అయితే మెక్సికో గడ్డపై అమెరికన్ సేనలను అనుమతించే ప్రసక్తి లేదని ఆమె తేల్చిచెప్పారు.

**డ్రగ్ మాఫియాపై వైమానిక దాడులు**

డ్రగ్స్ అక్రమ రవాణాను ఎదుర్కొనేందుకు మెక్సికోకు అమెరికా బలగాలు, నిఘా అధికారులను పంపాలని యోచిస్తున్నట్లు గత ఏడాది అక్టోబర్‌లో ట్రంప్ వెల్లడించారు. ఈ ప్రణాళికలో అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) కూడా పాల్గొంటుందని ఎన్‌బీసీ న్యూస్ తెలిపింది. మెక్సికోలోని డ్రగ్ కార్టెల్స్‌కు వ్యతిరేకంగా ఆపరేషన్ చేపట్టేందుకు ట్రంప్ ప్రభుత్వం పథక రచన చేస్తున్నట్లు అధికారులను ఉటంకిస్తూ ఎన్‌బీసీ న్యూస్ పేర్కొంది. ఈ మిషన్ కోసం ప్రాథమిక శిక్షణ ప్రారంభమైందని, మెక్సికో గడ్డపైన ఈ ఆపరేషన్‌లో జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్(యూఎస్‌వోసీ)కు చెందిన బృందాలు పాల్గొంటాయని తెలిపారు.

## పుర‘పోరు’కు గులాబీ సైన్యం రెడీ..

మొదటి తరువాయి

జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

**కరీంనగర్.. బీఆర్ఎస్ కంచుకోట**

శుక్రవారం కరీంనగర్ జిల్లా నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా రెండున్నర దశాబ్దాలుగా బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తూ పార్టీకి కంచుకోటలా మారిందని కొనియాడారు. ప్రతి వార్డు, డివిజన్ స్థాయిలో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయని స్థానిక నేతలు కేటీఆర్‌కు వివరించారు. ప్రతి మున్సిపాలిటీని ఒక యూనిట్‌గా తీసుకొని, అకడి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు రచించాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన పట్టణ అభివృద్ధిని వివరించాలని సూచించారు. రెండేండ్ల కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలే అస్త్రాలుగా ప్రచారం చేపట్టాలని చెప్పారు. గత రెండేండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణాల్లో ఒక రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. గ్రామీణ ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్ పాలనను తిరసరించారని, ఇదే ధోరణి పట్టణాల్లోనూ కనిపిస్తున్నదని తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ ఘనవిజయం సాధించాలని పిలుపునిచ్చారు.

## హిమాచల్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

మొదటి తరువాయి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# జల వివాదాలకు చెక్ పెడదాం

మొదటి తరువాయి

ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందన్నారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు లేదన్నారు. రాజకీయాలకతీతంగా పరిష్కారం కోసం అందరూ సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్టు ప్రకటించారు. ”పక్క రాష్ట్రాలతో తెలంగాణ వివాదాలను కోరుకోవడం లేదు. న్యాయస్థానాల ముందుకు లేదా మరెవరి వద్దనో పంచాయితీ పెట్టుకునే కన్నా కూర్చొని చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి” అని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణం, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం





నుంచి రావలసిన నిధులు, అనుమతులు కూడా రావడం లేదని, తద్వారా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. రాజకీయ ప్రయోజనా లకన్నా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం ఆలోచి స్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో కనెక్టివిటీ కోసం 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే కనెక్టివిటీతో సహా అనుమతి అడిగామని, ఆ కనెక్టివిటీని అభివృద్ధి చేయాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలంటే తెలంగాణ సహకారం అవసరం ఉంటుందని, పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవు తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో పరస్పర సహకారాన్ని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు.తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు భాగాలుగా అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిస్తూ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని వివరించారు. ఇందులో భాగంగా సుజెన్ మెడికేర్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రపంచంలో జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్‌తో పోటీ పడాలని సంకల్పించామని, అందులో భాగంగానే యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఫార్మా రంగంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందని, బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి దేశంలో తెలంగాణ నుంచి 40 శాతం ఉందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారత దేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీలో గొప్ప సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచమే మనవైపు చూసేలా ఫార్మా రంగంలో రాణిస్తున్నామన్నారు.

# 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

మొదటి తరువాయి

సమావేశమవు తుంది, ఆ రోజున ఆర్థిక సర్వే ప్రవేశపెడతారు. మళ్లీ 31వ తేదీన ఉభయ సభలు సమావేశం కావు, ఇక ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం నాడు కేంద్ర బడ్జెట్‌ను సభకు సమర్పించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియచేసే తీర్మానంపై చర్చ, కేంద్ర బడ్జెట్‌పై చర్చ అనంతరం పార్లమెంట్ సమావేశాలు ఫిబ్రవరి 13న వాయిదా పడతాయి. తిరిగి మార్చి 9వ తేదీన పార్లమెంట్



సమావేశమవుతుంది, ఏప్రిల్ 2 గురువారం నాడు సమావేశాలు ముగుస్తాయి. సాధారణంగా 3వ తేదీ శుక్రవారం వాయిదా పడాల్సి వుంది. అయితే ఆ రోజు గుడ్‌ఫ్రైడే తర్వాత వారాంతం కావడంతో ఏప్రిల్ 2నే ముగించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో విరామం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల పద్దులను పరిశీలించడానికి శాఖాపరమైన స్థాయీ సంఘాలకు ఉపయోగపడుతుంది.


# రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు?

మొదటి తరువాయి

అనంతరం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. ఎటువంటి అవినీతి అక్రమాలకూ తావులేకుండా రైతులకు రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను అందిస్తున్నామన్నారు. రీసర్వే పూర్తి అయిన 6,688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాలను వరుసగా మూడోమారు ముఖ్యమంత్రిగా నిర్వహించే అదృష్టం తనకు దక్కిందన్నారు. 2027 మార్చిలోగా పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఏటా మూడు వేల టిఎంసిల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, ఇందులో 300 టీఎంసీలు వాడుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. పోలవరాన్ని ఒక యజ్ఞంగా భావించి పూర్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ ప్రాజెక్టు పూర్తి కావడంలో జాప్యం జరిగిందన్నారు. గత పాలకుల తప్పిదాల వల్ల రూ.వెయ్యి కోట్లతో డయాఫ్రం వాల్ మళ్లీ కట్టాల్సి వస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో నీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. పట్టిసీమ కట్టి కృష్ణా డెల్టాలో వినియోగించుకుందామంటే వ్యతిరేకించారని విమర్శించారు. కృష్ణా డెల్టాలో నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలిస్తామన్నారు. కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ వివాదాలను పరిష్కరించడానికే రెండేళ్లు పట్టిందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును పిపిపిలో కడుతుంటే ముద్దు కానీ, పిపిపి కింద మెడికల్ కాలేజీలు కడితే వద్దంటున్నారని విమర్శించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. దేశంలోకొచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయని పేర్కొన్నారు. ట్రిబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ తరహాలో ప్రధాని మోడీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుంతలు లేని రహదారులను తయారు చేస్తున్నామని, రెండు రోజుల్లోనే 40 కిలోమీటర్ల రోడ్డు వేసి రికార్డు సృష్టించామని తెలిపారు.

# ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- ఉక్రెయిన్ జరిపిన దాడికి ప్రతీకారంగానే శుక్రవారం ఈ దాడులు
- ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపైకి వందల సంఖ్యలో డ్రోన్లు దాడి
- ఉక్రెయిన్‌పై రష్యా ఒరెష్నిక్ క్షపణితో ప్రయోగం
- ధ్వని కన్నా 10 రెట్ల వేగం దాని ప్రత్యేకత



**కీవ్,జనవరి 9**

ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి క్షపణులతో విరుచుకుపడింది. ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ జరిపిన దాడికి ప్రతీకారంగానే శుక్రవారం ఈ దాడులు జరిగినట్టు తెలుస్తున్నది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపైకి వందల సంఖ్యలో డ్రోన్లు, డజన్ల కొద్దీ క్షపణులు దూసుకొచ్చినట్టు అధికారులు వెల్లడించారు. రష్యా తమపైకి 13 ఖండాంతర క్షపణులు, 22 క్రూయిజ్ మిస్సైళ్లు, 242 డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ముఖ్యంగా ఒరెష్నిక్ మిస్సైల్‌ను రష్యా ప్రయోగించినట్టు పేర్కొన్నారు. ఒరెష్నిక్ మిస్సైల్ ధ్వని కన్నా పది రెట్ల అధిక వేగంతో గంటకు 13 వేల కిలోమీటర్ల స్పీడ్‌తో ప్రయాణిస్తుంది .యూరప్‌లోని దాదాపు అన్ని దేశాలపైకి ఈ మిస్సైల్‌ను ప్రయోగించేలా రష్యా దీన్ని డిజైన్ చేసింది. ఈ క్షపణిని దాని వేగం కారణంగా ఎవరూ అడ్డుకోలేరని పుతిన్ ఇటీవల వెల్లడించారు. ఇది అణ్వాయుధంతో సరిసమానమైనదని అన్నారు.రష్యా దాడిలో నలుగురు మరణించగా, 25 మంది వరకు గాయపడ్డారు.

## డీజీపీకి హైకోర్టులో ఊరట

మొదటి తరువాయి

డీజీపీగా బి.శివధర్‌రెడ్డి నియామకం చెల్లదని పేర్కొంటూ సోషల్ వర్కర్ టి.ధన్‌గోపాల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేశారు. డీజీపీ నియామకంపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలనీ, హైకోర్టు ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీపీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం పంపిందని అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి వివరించారు. డిసెంబరు 31న తాజాగా మరో జాబితాను పంపామనీ, అయితే ఆలస్యమైందని చెప్పి దానిని యూపీపీఎస్సీ వెనక్కి పంపిందని అన్నారు. కోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం, యూపీపీఎస్సీ విధిగా అమలు చేయాలన్నారు. గతంలో యూపీపీఎస్సీ రాష్ట్రానికి నాలుగు లేఖలు రాస్తే వాటిలో జాప్యం ప్రస్తావనే లేదన్నారు. ఏపీ ప్రభుత్వం 11 ఏండ్ల తర్వాత జాబితాను పంపితే యూపీపీఎస్సీ ఆమోదిం చిందని గుర్తుచేశారు. పిటిషనర్ అడ్వొకేట్ వాదిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం యూపీపీ ఎస్సీకి ఆలస్యంగా జాబితా పంపడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు.

# సీతారామ ప్రాజెక్టుతో సస్యశ్యామలం

మొదటి తరువాయి

మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జే.హేమంత కుమార్ ఆధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడారు. నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సహకారంతో ఏర్పాటుచేయబడిన ఈ వ్యవసాయ కళాశాల.. వ్యవసాయ విద్యలో ఉత్తమ కళాశాలగా నిలవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వంలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ డీపీఆర్‌లో లేదని, ఈ ప్రభుత్వంలో ఆ కెనాల్స్‌కు నిధులు మంజూరు చేశారన్నారు. నాల్గో పంపు హౌస్ నిర్మాణంతో దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు గోదావరి నీళ్లు అందుతాయని తెలిపారు. వ్యవసాయ రంగంలో దేశానికే ఆదర్శంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అగ్ర భాగాన ఉండాలన్నారు. సంక్రాంతి పండుగ రోజు నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలులోకి వస్తుందన్నారు.

**ఇరిగేషన్ మంత్రిగా మాట ఇస్తున్నా.. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తాం : ఉత్తమ్ కుమార్ రెడ్డి**

సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సశ్యశ్యామలం చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రిగా మాట ఇస్తున్నానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో నీటి కేటాయింపులు లేకుండా ప్రాజెక్ట్‌లు నిర్మాణం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరాక సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీలు గోదావరి జలాలు కేటాయింపు సాధించామని తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే తొలి వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట కళాశాల అ, దానికి అనుసంధానంగా అకడమిక్ బ్లాక్, బాలుర వసతి గృహం కోసం నూతన భవన సముదాయాలు నిర్మించాలని మంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆత్మ (బీఎఫ్ఏసీ) చైర్మెన్ సుంకవల్లి వీరభద్రరావు, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ ఎన్.గోపి, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు ఆల్తాఫ్ జానయ్య, రాజారెడ్డి, ఆయిల్ ఫెడ్ ఎండీ జాస్మిన్ బాషా, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఆయిల్ ఫెడ్ ఉన్నతాధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కి ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్





**-ఖని జూనియర్ కళాశాల మైదానంలో సభ నిర్వహణ**

**-మంత్రుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

అక్షరవేదం/గోదావరిఖని: జనవరి09

రామగుండంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం జనవరి 11న ఉంటుందని, ఇందులో రాష్ట్ర మంత్రులు పాల్గొంటున్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి రామగుండం నగరంలో మంత్రుల పర్యటన నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయ పరిధిలో ఉన్న హెలిప్యాడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న సభ ఏర్పాటు, గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో కలెక్టర్ సందర్శించే అధికారులకు పాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రామగుండంలో నిర్మించిన 633డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రాష్ట్ర మంత్రులు జనవరి 11న ప్రారంభిస్తారని, టూర్ షెడ్యూల్ త్వరలో ఖరారు అవుతుందని కలెక్టర్ తెలిపారు. మంత్రుల పర్యటన సందర్భంగా గోదావరిఖనిలోని జూనియర్ కళాశాల మైదానంలో 633మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు, 479 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు, 576మంది నిరుపేదలకు ఇంటి స్థలం పట్టాలు, పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. మంత్రుల పర్యటనకు వీలుగా హెలిపాడ్ వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జూనియర్ కళాశాలలో నిర్వహించే బహిరంగ సభకు అవసరమైన బ్యారికేడ్లు, సౌండ్ సిస్టం, స్టేజ్, ప్రజలకు త్రాగు నీరు, ఇతర ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలని, మంత్రుల చేతుల మీదుగా ఇండ్ల పట్టాలు, నూతన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రొసీడింగ్స్ కాపీలు అందుకునే లబ్ధిదారుల వివరాలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతరకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డి.సి.పి. రామ్ రెడ్డి, ఆర్.డి.ఓ.గంగయ్య, ఏ.సి.పి. రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక వృద్ధిలో బిట్స్ విద్యార్థుల పాత్ర కీలకం

**-తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

**-హైదరాబాద్‌లో బిట్స్ పిలానీ గ్లోబల్ మీట్ ప్రారంభం**



హైదరాబాద్, జనవరి 09 (అక్షర వేదం) :

భారత సాంకేతిక వృద్ధిలో బిట్స్ విద్యార్థుల పాత్ర కీలకం అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్‌లో బిట్స్ పిలానీ ప్రతిష్టాత్మక గ్లోబల్ మీట్-2026, అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ప్రపంచ సాంకేతిక కేంద్రంగా భారత దేశ కీర్తిని స్థాపించడంలో బిట్స్ పిలానీ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల(ఎల్ఈటీ, ఎఫ్) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్(ఐఏఎస్) మాట్లాడుతూ సాంకేతికత, నాణ్యమైన విద్య ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, నిరంతర అభ్యాసంలో బిట్స్ వంటి సంస్థలు జాతీయ భాగస్వామిగా ఎలా సహకరిస్తున్నాయో వివరించారు. బీజీఎం-26 ఛైర్‌పర్సన్ అనిత సాకూరు మాట్లాడుతూ మొదటి రోజు ముగింపులో ఇన్‌స్టిట్యూట్ వారసత్వాన్ని, స్నేహాన్ని చాటిచెప్పే సంప్రదాయ 'ఖవ్వాలీ' ప్రదర్శనతో కూడిన సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ(ఎఫ్ఏసీ), బిట్స్ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొ.వి.రామగోపాల్ రావు, ఇన్వెంటస్ క్యాపిటల్ పార్టనర్స్ ఎంజెల్ ఇన్వెస్టర్ కన్వల్ రేఖి, బీజీఎం-26 చీఫ్ సీఈఓ మయూర్ పట్నాలా తదితరులు పాల్గొన్నారు.

# చైనా మాంజా అమ్మిన ఉపయోగించిన కఠిన చర్యలు

**- జైపూర్ ఏసిపి జైపూర్**

అక్షర వేదం, జైపూర్, జనవరి 09

మంచిర్యాల జిల్లా జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు , జైపూర్ సిఐ నవీన్ కుమార్,ఎస్ ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో జైపూర్ మండల కేంద్రంలోని కిరాణా షాపులను తనిఖీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఏసిపి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో ఎవరైనా గాని చైనా మాంజ అమ్మిన గాని ఉపయోగించిన గాని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలపడం జరిగింది. అదేవిధంగా తగిన సూచనలు కూడా చేయడం జరిగింది. చిన్నపిల్లలు, పెద్దవారు పతంగులు ఎగరేయడానికి చైనా మంజా (నైలాన్/గ్లాస్ మంజా) ని ఎక్కువగా వాడుతున్నారు. ఈ చైనా మంజా వాడకం ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, పక్షిజీవులకు తీవ్రమైన



ప్రమాదాన్ని కలిగిస్తోంది.చైనా మంజా చాలా పదునుగా ఉండటం వలన ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తుల మెడ, చేతులు తీవ్రంగా గాయపడి చనిపోయే ప్రమాదం ఉంది.చిన్న పిల్లలు, పాదచారులు తీవ్రంగా గాయపడే అవకాశాలు ఉన్నాయి.పక్షలు ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది.విద్యుత్ తీగలకు చిక్కుకుని విద్యుత్ ప్రమాదాలు, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉంది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చైనా మంజా తయారీ, విక్రయం, నిల్వ మరియు వినియోగం పూర్తిగా నిషేధించబడింది. నిషేధిత చైనా మంజా వాడిన, విక్రయించిన లేదా నిల్వ ఉంచిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి. అందువలన జైపూర్ మండలంలోని ప్రజలందరూ:చైనా మంజా వాడకాన్ని పూర్తిగా మానుకోవాలని తమ పిల్లలకు కూడా దీనివల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని పర్యావరణానికి హాని చేయని సురక్షతమైన కాటన్ మంజా మాత్రమే ఉపయోగించాలని జైపూర్ పోలీస్ తెలుపుతున్నాము. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, చట్టాన్ని పాటించాలని కోరుతున్నాము. జైపూర్ ఎస్ ఐ జె. శ్రీధర్.

# ఆనంద్ జ్యోతి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు





అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి; బోడుప్పల్,జనవరి 09,

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్10, బోడుప్పల్ డివిజన్ పరిధిలో హరివిల్లును తలపించే రంగవల్లులు, హరిదాసుల పాటలు, గంగిరెద్దుల ఆటలు, నింగిలో రంగులు నింపిన పతంగులు, ముంగిట్లో భోగి మంటలు, నోరురించే పిండి వంటలు, చిన్నారుల కేరింతలు వీటన్నిటి నడుమ బోడుప్పల్ లోని భీమ్ రెడ్డి నగరలో గల ఆనంద జ్యోతి పాఠశాలలో సంక్రాతి సంబరాలు అంబరాన్ని తాకేలా సాగాయి. పాఠశాల ప్రిన్సిపల్ భాస్కర్, వైస్ ప్రిన్సిపల్ సునీత, సిబ్బంది చిన్నారులతో కలిసి సంక్రాంతి సంబరాలను కన్నుల పండువుగా నిర్వహించారు. బడిలో చదివే చిన్నారులు హరిదాసుల వేశధారనతో, సంప్రదాయ పాటలు పడుతు గంగిరెద్దులను ఆడించారు. పాఠశాల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేసి పండగ విశేషాలను వివరించారు. ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో భోగభాగ్యలు నింపాలని, పాడి పంటలు వెల్లివిరియాలని కోరుతూ పాఠశాల సిబ్బంది పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రు తదితరులు పాల్గొన్నారు.'

# విద్యార్థులకు షూ పంపిణీ..!



**-ప్రభుత్వ పాఠశాల పిల్లలకు బాసటగా వి.ఎస్.ఎస్.ఎస్**

**-వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం.**

అక్షరవేదం/గోదావరిఖని: జనవరి09

వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ఛైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం గోదావరిఖని 5ఇంక్లైన్ లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు షూ షాప్ నిర్వాహకులు షేక్ జాన్ మహమ్మద్, తాజ్ సహకారంతో షూ అండ్ సాక్సులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా సంస్థ గౌరవ అధ్యక్షులు పెద్దంపేట్ శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి. లయన్ డా, సిహెచ్ కిషన్ రావు, ఎంఈ ఓ మల్లేశం , సంస్థ సలహాదారులు లయన్ డా,కే. రాజేందర్ , జిఎంటి లయన్ బంక రామస్వామి, గోదావరిఖని ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పూదరి కుమార్ హాజరై షూ అండ్ సాక్స్ లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ నిర్వాకులు, తుము నరసయ్య, గడవేన సదానందం, భూపెల్లి జ్యోతి, దామోదర్ శర్మ, ముల్కల ప్రసాద్, భవాని దీక్ష యజ్ఞ సేవాసమితి అధ్యక్షుడు కట్ల సురేష్ భవాని, పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి, తో పాటు అధ్యాపకులు సమ్మయ్య, శ్రీనివాస్, రాజేశ్వరి, ప్రేమ్ కుమార్, సరళ కుమారి, విద్యాసాగర్, రాజేశ్వరి, సరిత, జోష్ణ తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన శెట్టిపల్లి ములమలుపు రహదారి

**రహదారి పై స్పీడ్ బ్రేకర్ లు నిర్మించాలి ప్రమాదకరంగా మారిన శెట్టిపల్లి పోచమ్మ గుడి ములమలుపు**




అక్షర వేదం,జైపూర్,జనవరి 09

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని జైపూర్ నుండి శెట్టిపల్లి వెళ్ళే పోచమ్మ గుడి దగ్గర గల మూల మలుపు ప్రమాదకరంగా మారింది.టేకుమట్ల నుండి శెట్టిపల్లి పోయే రహదారి,జైపూర్ వెళ్ళే దారి తీన్ రాస్తా కలిసే దగ్గర అతివేగంతో వాహనాలు దూసుకుపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని,జాతీయ రహదారి కోసం మట్టి లారీలు , వేలాల లోని ఇసుక క్వారీ నుండి వచ్చే ఇసుక లారీలు,ఆర్టిసి బస్సులు ఈ దారిగుండ నిత్యం ప్రయాణిస్తుంటాయని, వీటి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని,ఇదివరకే ఆ దారిలో చాలా ప్రమాదాలు జరిగాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు దారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చని ప్రయాణికులు తెలిపారు.సంబంధిత అధికారులు ,స్థానిక నాయకులు స్పందించి వాహనాల అధిక వేగం నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు,స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# జైపూర్ సబ్- స్టేషన్ మరమ్మత్తులు విద్యుత్ అంతరాయం

అక్షర వేదం, జైపూర్, జనవరి 09

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం జైపూర్ సబ్-స్టేషన్ పరిధిలోగల గ్రామాల విద్యుత్ వినియోగదారులందరికి తేలియజేయునది ఏమనగా రేపు అనగా తేది: 10.01.2026 రెండవ శనివారం రోజున జైపూర్ సబ్- స్టేషన్ మరమ్మత్తు పనులు చేయుటకు నిర్ణయించడమైనది. కావున జైపూర్ సబ్ స్టేషన్ పరిధిలోగల మిట్టపల్లి, కన్నూర్, ముదిగుంట, రసూల్ పల్లి, దుబ్బపల్లి,



వెంకటరావుపల్లి, జైపూర్, పెగడపల్లి, గంగిపల్లి మరియు ఎల్కంటి గ్రామాలకు ఉదయం 10:00 గంటల నుండి మద్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుంది. కావున వినియోగదారులకు సహకరించగలరని మనవి.

జైపూర్ ఎ ఇ మనోహర్.

# వాటర్ పైప్ లైన్ పగిలి కాలనీ వాసుల ఇబ్బంది...

- 'దర్గా' చొరవతో సమస్యకు పరిష్కారం




**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజిగిరి/మేడిపల్లి; జనవరి 09 గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్10, పిర్జాదిగూడ పరిధిలోని 40 ఫీట్ రోడ్డులో గల మల్లికార్జున నగర్ లో కొద్దిరోజుల క్రితం వాటర్ పైప్ లైన్ పగిలిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం సీనియర్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి దృష్టి కి తీసుకుపోయారు. దీంతో స్పందించిన ఆయన జలమండలి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులుపనులు మొదలు పెట్టి సమస్య వెంటనే పరిష్కరించిరించారు. .ఈ కార్యక్రమం లో దేవర మల్లికార్జున్, మరియు కాలానివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజిగిరి/మేడిపల్లి; జనవరి 09,**
బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడలోని ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో శుక్రవారం రోజున ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబరాలు అంబరంటాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీతా జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో తోరణాలతో పల్లెటూరి వాతావరణానికి అనుగుణంగా అలంకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీతా మాట్లాడుతూ... పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలకు పట్టుకొమ్మలు అని మనలో ఐక్యతకు నాంది అని అన్నారు. సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరికి గొప్పనైన పండుగ అని చిన్నారులు, మహిళలు ముఖ్యంగా రైతులకు ఈ పండుగ చాలా విశిష్టమైన పండుగ అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంక్రాంతి సంబరాలలో భాగమైనటువంటి భోగి పండ్లు భోగిమంటలు, గోదారంగనాధుల కళ్యాణము, పిండివంటలు మరియు రంగవల్లుల విశిష్టతను తెలిపారు. సంక్రాంతి పాటలపై విద్యార్థుల నృత్య ప్రదర్శన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల కేరింతలతో, ఆనందోత్సాహాలతో పాఠశాల ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపీఓ



**అక్షర వేదం, జైపూర్, జనవరి 09**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండల్ పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు జైపూర్ మండలం ఇందారం, రామారావు పేట గ్రామపంచాయతీ ల ని ఆప్ ఇన్స్పెక్షన్ లో భాగంగా సందర్శించారు. గ్రామాలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను, నర్సరీ, సెగ్రి గేషన్ షెడ్, స్మశానవాటిక ను పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్ నందు వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేయించాలని, తయారైన ఎరువు విక్రయించి అట్టి రూపాయలను ట్రెజరీ నందు గ్రామ పంచాయతీ సాధారణ నిధికి జమ చేయాలని, క్రమం తప్పకుండా ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంక్ లు శుభ్రపరచాలని, రెగ్యులర్గా క్లోరినేషన్ చేయాలని, రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని, ఇంటి పన్ను వసూలును వేగవంతం చేసి ఎప్పటికప్పుడు రషీదులను ఆన్లైన్ చేయించి ఈనెల ఆఖరి తేదీ వరకు 100% పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమును పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ పర్యటనలో ఎంపీవో తో పాటుగా ఇందారం సర్పంచ్ ఫయాజ్ పంచాయతీ కార్యదర్శి, ఏ.సుమన్,రజిత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణిలో బొమ్మల కొలువు అదుర్స్..!





- తెలంగాణ సాంస్కృతిక సన్నివేశాలు ఆకట్టుకున్నాయి.



**అక్షరవేదం/గోదావరిఖని: జనవరి09**
ఆర్.జి.1 ఏరియా ఇల్లందు క్లబ్ లో లేడీస్ క్లబ్ అధ్యక్షరాలు అనిత లలిత్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం బొమ్మల కొలువు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతితులుగా సింగరేణి సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ సతీమణి ఎల్.వి. మాలతి సూర్యనారాయణ, సంస్థ డైరెక్టర్ (ఇ.అండ్.ఎం) తిరుమల్ రావు, సంస్థ డైరెక్టర్స్ కె. విజయ లక్ష్మ వెంకటేశ్వర్లు, పద్మ తిరుమల రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. బొమ్మల కొలువులో మన సంస్కృతి సంప్రదాయం ఉట్టి పడేలా ఉన్నాయని ఇందులో ప్రత్యేకంగా వైకుంఠ ద్వారాలు, చేద బావి, పొలము, భోగి పండ్లు పోసే కార్యక్రమం, సమ్మక్క సారలమ్మ, చిలకలగుట్ట, నవగ్రహ వనాలు, రాశి వనాలు, ఏడు విష్ణుద్వారాలతో గరుడ ప్రవేశం, అమ్మోరు, శివుడు, రైసింగ్ తెలంగాణ, శాంతి బౌద్ధ విగ్రహం, ప్రాచీన వస్తువులు అన్ని ప్రదర్శించారు. పల్లెటూరి వాతావరణాన్ని సృష్టించి పూర్వపు చరిత్రని ప్రస్తుత వారికి తెలిపేలా బొమ్మల కొలువును ఏర్పాటు చేసిన కుటిరం, మంచే, సంక్రాతి సంబురాలలో ఏర్పాటు చేసే , చుట్టు ప్రక్కల పల్లెటూరి వాతావరణం, సమ్మక్క సారక్క సంస్కృతి అంశాలపై అవగాహన కలిగేలా బొమ్మలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లేడీస్ క్లబ్ సభ్యులు చేసిన ఆధ్యాత్మికతతో దశావతారాల థీమ్ బొమ్మల కొలువు అంగరంగ వైభవముగా సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్జీ.1,2,3 జిఎం లు డి. లలిత్ కుమార్, మధుసూదన్, ఆర్జీ రీజియన్ క్వాలిటి జిఎం సుజోయ్ మజుందర్, రెస్క్యూ జిఎం శ్రీనివాస రెడ్డి, త్రిప్తి అంబర్ కిషోర్ జా కమిషనర్ ఆఫ్ పోలీస్ సతీమణి, బి. వనజ వెంకటయ్య, ఎస్. తిరుమల, సుప్రియ, సుజోయ్ మజుందర్, కె. వాణి శ్రీనివాస రెడ్డి, ఎన్. అలివేణి సుధాకర రావు, ఉమ శ్రీనివాస్, వెంకటలక్ష్మ నాగేశ్వరరావు, సునీత రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మ రఘు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**అక్షర వేదం,మంచిర్యాల, జనవరి 09**
మంచిర్యాల జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, బాలల సంక్షమ కమిషన్ చైర్మన్ మహమ్మద్ వహీద్ లతో కలిసి సంక్షమ శాఖల అధికారులు, పోలీసు, కార్మిక, విద్య, వైద్య-ఆరోగ్య, పౌర సంబంధాల శాఖల అధికారులతో ఆపరేషన్ స్మైల్ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడి వారికి మంచి భవిష్యత్తును అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. కార్మిక శాఖల అధికారులు బృంద సభ్యులతో కలిసి పరిశ్రమలు, దుకాణాలు, నిర్మాణ ప్రాంతాలు ఇతర ప్రదేశాలను సందర్శించి బాల కార్మికులను గుర్తించాలని తెలిపారు. 14 సం?లలోపు వయసు కలిగి బాల కార్మికులు పని చేస్తున్నట్లుగా గుర్తించినట్లయితే సంబంధిత సంస్థల యాజమాన్యంపై కేసులు నమోదు చేసి, బాధిత బాలలకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. బాల్యవివాహాలను నిర్మూలించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. గుర్తించబడిన బాల కార్మికులకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లాలో ఆపరేషన్ స్మైల్ నిర్వహించడం జరుగుతుందని, ఇటుక బట్టీలలో పనిచేసే వారి పిల్లలను పాఠశాలలో చేర్పించడం, అవసరమైన పుస్తకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సంక్షమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్. దుర్గాప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా మైనార్టీ సంక్షమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, బాలల పరిరక్షణ కమిటీ అధికారి ఆనంద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీయుపిఎస్ పంగిడిపల్లి లో రంగోలి పోటీలు



సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని ముందస్తుగా సంక్రాంతి సెలవులకు ఒక రోజు ముందు రోజున విద్యార్థినులకు రంగోలి కార్యక్రమము చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంగిడిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ వలిగే కళ్యాణి స్వయంగా తను కూడా ముగ్గులు వేస్తూ విద్యార్థులతో సందడి సందడిగా గడిపారు. విద్యార్థులు వేసిన ముగ్గులను చూసి సంభ్రమాశ్చర్యాలకు గురి అయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపగిరి శ్రీనివాస్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కురిమిళ్ళ సారయ్య, అలిగిరెడ్డి రాజేందర్ రెడ్డి,కత్తి రజిని, కందుకూరి శంకర్,మాలోతు అఖిల్ సాయి, గ్రామ పెద్దలు వలిగే యుగేందర్, తిప్పారపు యుగంధర్ అంగన్వాడి టీచర్ రజిత, ఆయా రమ, విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఎం పి యుపిఎస్ పంగిడిపల్లిలో పాత భవనము కూల్చివేత



**అక్షర వేదం ప్రతినిధి**
పంగిడిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ వలిగే కళ్యాణి ఆధ్వర్యంలో ఎంపీయుపిఎస్ పంగిడిపల్లి ఆవరణంలో అత్యంత ప్రమాదకరంగా పెచ్చులు ఊడిపోతూ శిథిలావస్థలో ఉన్న పాత తరగతి గది భవనాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపగిరి శ్రీనివాసు టెంకాయ కొట్టి కూల్చి వేత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కురిమిల్ల సారయ్య అలిగి రెడ్డి రాజేందర్ రెడ్డి కత్తి రజిని కందుకూరి శంకర్ మాలోత్ అఖిల్ సాయి కరోబార్ వరికోలు రాజయ్య,అంగన్వాడి టీచర్ రజిత,విజయ, రమ తదితరులు పాల్గొన్నారు.

# మహాముత్తారం మండలంలో సీఎం కప్ టార్చ్ వెలిగించి ర్యాలీ

**-విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కల్పించాలి**
**-సర్పంచ్ కొండ గొర్ల బాపు**




**అక్షర వేదం/మహా ముత్తారం, జనవరి 10:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మా ముత్తారం మండల కేంద్రంలోసీఎం కప్ టార్చ్ ర్యాలీ సందర్భంగా విద్యార్థులకు చదువుతో పాటు ఆటల పట్ల ఆసక్తి ఉండాలి.గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసి , వారికి శిక్షణ ఇచ్చి వారిని ఉన్నత స్థాయికి తీసుకుపోవాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకుంది.ప్రతిభ కలిగిన మీ అందరికీ మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుంది.ప్రభుత్వం సంకల్పం తీసుకుంటే సరిపోదు..క్రీడల పట్ల ఆసక్తి నైపుణ్యం ఉన్న ఆటలకు అనుగుణంగా మీరు శిక్షణ తీసుకోండి,క్రీడాకారులకు ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చింది స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసింది.యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ మాత్రమే కాకుండా జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంద ప్రపంచంలో,దేశంలో అనేక క్రీడల్లో అవార్డులు తీసుకొని కీర్తి పొందిన వారు అంతా గ్రామీణ స్థాయి నుండి వచ్చిన వారే ఏదైనా ఒక ఆట లో ఆసక్తి ఉన్న దానిని ఎంపిక చేసుకొని శిక్షణ తీసుకోవాలి.ఆటలు ఆడి రాణిస్తే నేరుగా గ్రూప్ 1 డీఎస్పీ ఉద్యోగాలు ఇచ్చింది.క్రికెట్ ఆడిన సిరాజ్ కి డీఎస్పీ ఉద్యోగం ఇచ్చింది.గ్రామీణ, మండల ,జిల్లా ,రాష్ట్ర స్థాయిలో జరిగే సీఎం కప్ టోర్నీలో విద్యార్థులు రాణించాలి.ఆటల్లో పాల్గొనే మీ అందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో, పోలంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు రామినేని వెంకటరాజం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ పై,రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటి.ఆర్ దిష్టిబొమ్మను మరిపెడ టౌన్ లో ఆర్.అండ్.బి గెస్ట్ హౌజ్ ఎదురుగా యూత్ కాంగ్రెస్ ఆద్వర్యంలో దహనం చేశారు.



**అక్షర వేదం /డోర్నకల్ నియోజకవర్గం ,మహబూబాబాద్ జిల్లా ,మరిపెడ టౌన్:-జనవరి 9 .** తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ, చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్ , మరియు మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జ్ బుక్యా వెంకట్ నాయక్ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ నాయక్ మరియు మండల యూత్ అధ్యక్షుడు బానోతు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో ఇటీవల రాహుల్ గాంధీ పై మరియు రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటి.ఆర్ దిష్టిబొమ్మను డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండల ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఎదురుగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది అనంతరం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బానోతు నరేష్ నాయక్ గారు మాట్లాడుతూ కేటిఆర్ నువ్వు రాహుల్ గాంధీ కాలిగోటికి సరిపోవు అంటూ వారు వ్యాఖ్యానించారు. 10 ఏళ్లుగా తెలంగాణ ప్రజల రక్తం తాగిన రాక్షసుడు మీరు... మిమ్మల్ని ఉరితీసి మా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కొడుతారని వారు హెచ్చరించారు...తెలంగాణ రాష్ట్రం మీ అయ్య కేసీఆర్ జాగీరు కాదని... మరోసారి మా నాయకులపై చిల్లర మాటలు మాట్లాడితే ఖబర్దార్ అని విజయ్ నాయక్ హెచ్చరించారు...
తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ కుమారుడిపై చిల్లర మాటలు మాట్లాడే కేటీఆర్ కు రాజకీయ భవిష్యత్తు లేదని.. నువ్వు జీవితంలో ముఖ్య మంత్రి కాలేవని వారు అన్నారు... మరోసారి మా నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మీ టిఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.ఇకనైనా కేటి.ఆర్ బుద్ధి తెచ్చుకొని బాధ్యత గల ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టు ఇలాంటి చిల్లర ప్రయత్నాలు బంద్ చేసి బాధ్యతగా ఉండాలని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మరిపెడ మండల ఉప అధ్యక్షుడు జాటోత్ సురేష్ నాయక్ , మరిపెడ మండల కోఆర్డినేటర్ ఐవైసీ వెంకట్ సాయి, బానోతు వెంకన్న, ఇస్లావత్ తిరుపతి, చిన్న,వంశీ, వారితో పాటు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ ఐలమల్లు, మరిపెడ టౌన్ అధ్యక్షులు తాజుద్దీన్, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గూగులోత్ రవి నాయక్, సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, గంధసిరి బిక్షపతి, పట్టణ సీనియర్ నాయకులు రమేష్ నాయక్, దేవరశెట్టి లక్ష్మ నారాయణ, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బాసిపంగు రవికాంత్, రవి నాయక్,సర్వర్ పాషా, భుక్య వెంకన్న నాయక్, భుక్య నెహ్రూ నాయక్, వల్లెపు లింగన్న, సోమచంద్రయ్య, సర్పంచ్ భద్రు నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయీ ఐక్య ఉద్యమ పోరాటంలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలి

**- టిపిటిఎఫ్ సంపాదక వర్గ సభ్యులు సూరం ఉపేందర్ రెడ్డి**




**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు రెవెన్యూ డివిజన్:-జనవరి 9.** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంలో ఈ రోజు నిర్వహించిన పాఠశాల స్థాయీ నల్లబ్యాడ్జీల నిరసన ప్రదర్శనలో పాల్గొన్న టిపిటిఎఫ్ అధికార మాసపత్రిక సంపాదక వర్గ సభ్యులు సూరం ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.జాతీయస్థాయి ఉద్యమంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అలాగే ఈ క్రింది సమస్యల సాధనకై దశల వారి పోరాటానికి కూడా మద్దతునివ్వాలన్నారు. 1.సర్వీస్ లో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. 2. జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. 3. ఎం.ఎల్.సి ఎన్నికలలో ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలి. 4.పాఠశాలల విలీనం మరియు మూసివేతను ఆపివేయాలి.ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి పలు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సంపూర్ణ మద్దతుతో రానున్న రోజుల్లో,పలు దఫాలుగా నిరసన కార్యక్రమాలుశీటాయన్నారు. 1. 09. 1. 2026న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలి. 2. 9,10 తేదీలలో రాష్ట్రపతి ప్రధానమంత్రి కార్యాలయాలకు మెమోరండం సమర్పణ చెయ్యాలి. 3. ఫిబ్రవరి 5న ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలి. పై నిరసన కార్యక్రమాల్లో ప్రతి ఒక్క ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కొండం జనార్ధన్,ప్రధాన కార్యదర్శి కొలుపుల శ్రీనివాస్ తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన




**అక్షరవేదం/గోదావరిఖని: జనవరి09** రామగుండం ఆర్ఎఫ్సిఎల్ ఆధ్వర్యంలో యుపిఎస్ ఎల్కలపల్లి పాఠశాలలో రోడ్డు భద్రత పై ప్రధానోపాధ్యాయులు లక్ష్మనారాయణ అధ్యక్షతన పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సిఎల్ డిప్యూటీ మేనేజర్ విజయ్ రోడ్డు భద్రత పై మాట్లాడుతూ... ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఈ విషయం పట్ల వివరించాలన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత పాటించాలని, సురక్షత ప్రయాణాలు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ హెచ్అర్ వెంకట్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీరామ్ ఎలుకలపల్లి సర్పంచ్ అంజిబాబు, గుంటూరుపల్లి సర్పంచ్ హరినాథ్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీపాద కాలనీలోని క్రికెట్ క్రీడాకారులకు టీషర్టు లు పంపిణీ కార్యక్రమం




**అక్షర వేదం/మంథని,జనవరి 9:** మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు శ్రీపాద కాలనీ టీంకు శుక్రవారం రోజున మాజీ వార్డు సభ్యులు ఆకుల కవిత శ్రీనివాస్ ఆధ్వర్యములో టీషర్టు లు పంపిణీ చేయడం జరిగింది.శ్రీపాద కాలనీ మెగా టోర్నమెంట్ ను జనవరి 8న నిర్వాహకులు ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రీడా కారులకు జెర్సీ టీషర్టు లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,టోర్నమెంట్ ఆర్గనైజర్లు రాకేష్, రాజేష్,రవి,ధనుంజయ్, నితిన్,కళ్యాణ్,క్రీడాకారులు బన్నీ,సాయి,నరేష్ తదితరులు పాల్గొన్నారు..

## కిండర్ కబ్స్ ప్రీస్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు




**అక్షర వేదం/రంగారెడ్డి జిల్లా, నిజాంపేట్ :-జనవరి 9.** రంగారెడ్డి జిల్లా నిజాంపేట్ లో ఉన్న కిండర్ కబ్స్ ప్రీస్కూల్ లో ముందస్తుగాఅబశ్రీశ్రీ సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించినారు.
ఈ కార్యక్రమంలో కిండర్ కబ్స్ ప్రీ స్కూల్ డైరెక్టర్లు ప్రసాద్,అభిషేక్,శ్రావ్య,సింధు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యంగుల క్యాలెండరు 2026 ఆవిష్కరించిన తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ మూత్తినేని వీరయ్య వర్మ.



**అక్షర వేదం/హైదరాబాద్, మలక్ పేట:-జనవరి 9.** నేడు బండ జగన్ ఆధ్వర్యంలో దివ్యంగుల క్యాలెండరు 2026 ఆవిష్కరించిన తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ మూత్తినేని వీరయ్య వర్మ, జి.ఎచ్.ఎం.సిఅబశ్రీశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బండ జగన్,కిరణ్ గుత్తికొండ తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు, శివకృష్ణ తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు,బక్క సుధాకర్, శ్రీనివాస్, వెంకటేష్, నరేష్, హుస్సేన్, అయేషా రహమతుల తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ జిల్లెల ఆదిత్య రెడ్డి, చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి అధ్యక్షతన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ కు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి



**అక్షర వేదం /వనపర్తి:** హైదరాబాద్ తుక్కుగూడ టిపిఆర్ కన్వెన్షన్ హాల్ లో జరిగింది. ఎగ్జిక్యూటివ్ మీటింగ్ కు తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి అధ్యక్షతన జరిగింది.ఎగ్జిక్యూటివ్ మీటింగ్ కు ముఖ్యఅతిథిగా మైనార్టీల సంక్షమం, పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు.ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ భారతదేశంలోనే అతిపెద్ద మరియు అత్యంత ప్రభావవంతమైన రాజకీయ పార్టీలలో ఒకటి అని దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఈ పార్టీ, నేటికీ దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా కొనసాగుతుంది అని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండటం మన అదృష్టంగా భావించాలని, రాష్ట్రాలలో ఏఐపిసి విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ఏఐపిసి అధ్యక్షులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ జిల్లా స్థాయి పోటీలో మంథని గర్ల్స్ పాఠశాల విద్యార్థి ప్రతిభ



**అక్షర వేదం/మంథని,జనవరి 9:** అప్పన్నపేట జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్, ఎడ్యుక్వెస్ట్ టెడ్ టాక్ పోటీలో జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ మంథని పాఠశాలకు చెందిన విక్రాంత్ కు మొదటి బహుమతి వచ్చింది.జనవరి 20 న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.ఈ పోటీల్లో గైడ్ టీచర్స్ గా శేషాద్రి,రవీందర్,ఉమా మహేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు..

## నిరుపేద కుటుంబానికి బోడ రమేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల పట్టణ అర్థిక సహాయం



**అక్షర వేదం/ మరిపెడ మండలం, మాకుల తండ ,10వ వార్డు:-జనవరి 9.**

10 వ వార్డుకు చెందిన బానోతు వాల్య దశ దిన కర్మకు బోడ రమేష్ కవిత దంపతులు 50కేజిల బియ్యం నిత్యవసర సరుకులు సహాయం. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని మరిపెడ పట్టణానికి చెందిన బానోతు వాల్య, ఇటీవల మరణించగా, దశ దిన కర్మ సందర్భంగా మానవతా దృక్పథంతో బోడ రమేష్ నాయక్ ముందుకు వచ్చి 50 కిలోల బియ్యం తో పాటు నిత్యావసర సరుకులను సహాయంగా అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని మాకులతండా గ్రామస్తులు.బోడ రమేష్ నాయక్ సేవాభావాన్ని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు మాకుల తండా యూత్,ఇస్లావత్ బాలనాయక్,బానోతు రఘు,బోడ లచ్చ నాయక్,బోడ పీక,బానోతు సీతారాం సాధు,బానోతు మల్చుర్,బోడ వాసు,కాశ్య, బోడ అనిల్ కుమార్, భూక్య సంతోష్ కుమార్, బాదావత్ ప్రభాస్, బోడ అనిల్, బోడ తరుణ్, బోడ వాసు, గుగులోత్ శివాజీ, గుగులోత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు...

### బత్తిని వీరాస్వామి గౌడ్, తపస్ హన్మకొండ జిల్లా అధ్యక్షల అమ్మ కి ఘన నివాళులు



**(అక్షర వేదం ప్రతినిధి, పంతిని, వర్ధన్నపేట్)** బత్తిని వీరస్వామి గౌడ్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు అమ్మ బత్తిని అనసూర్య ఐదవ రోజు కార్యక్రమం లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాపగిరి శ్రీనివాస్ మాజీ ప్రధాన కార్యదర్శి సంగం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మూల రామకృష్ణ, రాజేందర్ రెడ్డి పాల్గొని అనారోగ్యంతో పరమపదించిన బత్తిని అనసూర్య కి ఘనంగా నివాళులు అర్పించి, మరి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు.అనంతరం వారి కుమారులు బత్తిని సమ్మయ్య గౌడ్ వీరస్వామిగౌడ్, ఎల్లగౌడ్ లను మరియు కుటుంబ సభ్యులను పరమార్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు.

# సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

**అక్షర వేదం /మరిపెడ మండలం, మరిపెడ టౌన్:-జనవరి 9.**



రామాలయం టెంపుల్ దగ్గర సీతారాంపురం ప్రాదామికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు. సంక్రాంతి అంటే పెద్ద పండుగని, పంటల పండుగని, పెద్దల పండుగని,పశువుల పండుగౌపుడమి పుస్తకంలో ప్రకృతి రాసుకున్న మధురమైన కవిత. గీసుకున్న అద్భుతమైన చిత్రిక. హరితవర్ణపు చీరను కట్టుకుని, బంతి చేమంతులను జడలో తురుముకుని ..రంగవల్లికల రంగుల దారిలో నడిచి వచ్చే సంక్రాంతి దేవతను చూసి మురిసిపోని మనిషి వుండడని. సంబరపడని కర్షకుడు వుండడని. మనిషికి తెలిసిన తొలి పండుగ సంక్రాంతే! బీడు నేలను దుక్కి దున్ని పంటసిరిగా మార్చిన మానవుడికి ఇదే తొలి పండుగ అని సీతారాంపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోత్ అర్జున్ నాయక్ అన్నారు.అప్పట్నుంచే మనిషి జీవితం బహు ముఖాలుగా, బహు విధాలుగా వికసించిందని, అభ్యున్నతి దిశగా అడుగులు వేసిందని అన్నారు. దీనంతటికి కారణం సూర్యుడు. సూర్య భగవానుడే మనకు జీవాధారమని,సమస్త జీవరాశికి, వృక్షజాతి మనుగడకు ఆయనే కారణం అని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలు ఉద్దేశించి మాట్లాడుతూ సంక్రమణం అంటే గమనం. సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి అడుగుపెట్టడాన్ని సంక్రమణం అంటామని, ఏడాదిలో సూర్యుడు పన్నెండు రాశు లలో ప్రవేశిస్తాడని. ఈ నెలలో ప్రవేశించేది మకర రాశిలోకి. అందుకే ఇది మకర సంక్రాంతి అయ్యిందని,పుష్యమాసంలో వచ్చే మకర సంక్రమణం ఉత్తరాయణానికి నాంది, పుణ్యప్రదం కూడా.అందుకే మకర సంక్రాంతి శుభవేడుకగా మారిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మంగీలాల్,లింగాల మహేష్ గౌడ్,కవిత, వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి, సందీప్,సారిక, విద్యార్థని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఖబర్దార్ కేటీఆర్!....





**అక్షర వేదం/ మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండల కేంద్రం :-జనవరి 9 .**

నేడు మరిపెడ మండల కేంద్రమైన మరిపెడ మున్సిపాలిటీలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. రాహుల్ గాంధీ మరియు రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన డోర్నకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో మహబూబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జర్పుల విజయ నాయక్ మాట్లాడుతూ ఎంపీ రాహుల్ గాంధీ ని మరియు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీద కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. వారికి క్షమాపణ చెప్పాలి .లేదంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల చేత చెప్పు దెబ్బలు రుచి చూస్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముఖ్య నరేష్ నాయక్, ఉపాధ్యక్షులు జాటోత్ సురేష్ నాయక్, మరిపెడ మండల కోఆర్డినేటర్ ఐవైసి అక్కినపల్లి వెంకట సాయి, తిరుపతి వారితోపాటు కేసముద్రం వైస్ చైర్మన్ ఐలమల్లు, మరిపెడ పట్టణ అధ్యక్షులు తాజుద్దీన్, మహబూబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గుగులోత్ రవి నాయక్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అప్సర్, మరిపెడ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవికాంత్, గంధసిరి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ పాఠశాలలో ముందస్తుగా కళాత్మకంగా సంక్రాంతి సంబరాలు

**అక్షర వేదం/మంథని,జనవరి 9:** మంథనిలోని కాకతీయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం రోజున ముందస్తుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భోగి మంటలు ఏర్పాటు చేసి సంక్రాంతి పొంగలిని తయారు చేశారు.విద్యార్థులు సంక్రాంతి పండుగ సంబంధించిన వివిధ వేషధారణలతో అలరించారు. అనంతరము పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి ఆదిత్య హాస్పిటల్,కేకే క్రియేషన్స్ యూట్యూబ్ ఛానల్ కళ్యాణి కుకడపు వారు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఆదిత్య హాస్పిటల్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శిరీష పిల్లలను భోగిపళ్ళతో ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు పండగలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మన సంస్కృతి,సాంప్రదాయాలపై అవగాహన పెంపొందిస్తాయని అన్నారు. తల్లిదండ్రులకు, పిల్లలకు,ఉపాధ్యాయులకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక






కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణము కలకలలాడింది. ఈ సంబరాలలో పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, పావని,స్రవంతి విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..